క్లుప్తంగా

నవోదయకు ఎంపిక



జుఝవరం (పామర్రు): గ్రామంలో ఉషోదయ హైస్కూల్‌కు చెందిన విద్యార్థికి జవహర్ నవోదయ పాఠశాలలో 9వ తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎండీ రఫీ మాట్లాడుతూ 9వ తరగతిలో ప్రవేశానికి గతంలో నిర్వహించిన పరీక్షా ఫలితాలు వచ్చాయన్నారు. ఈ ఫలితాల్లో తమ హైస్కూల్ విద్యార్థి ఎస్.లీలా కృష్ణ మనోహర్ ఉత్తమ ప్రతిభ కనబర్చి నవోదయలో సీటు సాధించాడని తెలిపారు. మనోహర్‌తోపాటు ఇందుకు కారకులైన ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

రోడ్డుపై గాయపడిన పశువుకు శస్త్రచికిత్స



గుడివాడరూరల్: స్థానిక ముబారక్ సెంటర్‌లో రోడ్లపై ఉండే పశువును గుర్తు తెలియని వాహనం మంగళవారం ఢీకొట్టింది. దీంతో కాలు విరిగి రక్తపు మడుగులో ఉన్న పశువుకు సామాజిక వేత్త మాచర్ల రామకృష్ణ (ఆర్.కె) పశు వైద్యులతో శస్త్ర చికిత్స చేసి రక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ నోరులేని మూగ జీవాలను రోడ్ల మీద వదిలేయడంతో వాటికి ఎన్నో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పశువులు రోడ్ల మీద సేద తీరడంతో ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా ఉంటుందని, పశు యజమానులకు మున్సిపల్, పోలీస్‌శాఖ అధికారులు నోటీసులు జారీ చేసి హెచ్చరించాలని కోరారు. అడిగిన వెంటనే పశువుకు శస్త్ర చికిత్స చేసిన వైద్యులకు ఆర్‌కే కృతజ్ఞతలు తెలిపారు.

అథ్లెటిక్స్‌లో విద్యార్థుల ప్రతిభ



పామర్రు: అథ్లెటిక్స్ నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి తమ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయికి ఎంపిక అయ్యారని పామర్రు ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఏ ఇందిరారాణి తెలిపారు. మంగళవారం స్థానిక హైస్కూల్‌లో విజేతలైన వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తోట్లవల్లూరు మండలం పెనమకూరులో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అండర్-17 విభాగంలో సీహెచ్ స్నేహలత 400 మీటర్ల విభాగంలో ద్వితీయ స్థానం, 200 మీటర్లలో తృతీయస్థానం సాధించిందన్నారు. అండర్-14 విభాగంలో ఆర్.శ్రీ దివ్య హైజంప్‌లో ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. విజేతలైన విద్యార్థులను వీరికి శిక్షణ ఇచ్చిన పీడీలో జీ మురళీ, రవి కిషోర్‌లను హెచ్‌ఎం ఉపాధ్యాయులు అభినందించారు.

తపాలా జీవిత బీమాతో ప్రయోజనం

కైకలూరు: గ్రామీణా తపాలా జీవిత బీమాతో ఎంతో ప్రయోజనమని మండలంలోని పెంచికలమర్రు సర్పంచ్ జయమంగళ కాసులు అన్నారు. గ్రామానికి చెందిన సైదు లక్ష్మీ బీమాకు సంబంధించి ప్రీమియం చెల్లించి ప్రమాదవశాత్తూ మరణించింది. జీవిత బీమా సొమ్ము రూ.1.66 లక్షల చెక్కును సర్పంచ్ లక్ష్మి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి జీవిత బీమాకు ఆదరణ లభిస్తోందన్నారు. గుడివాడ డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.కర్ణప్రసాద్, కైకలూరు సబ్ డివిజన్ మెయిల్ ఓవర్సీస్ టి.దుర్గాప్రసాద్, పల్లెవాడ నుంచి వీవీ పవన్‌కుమార్, జి.మోహనవర్మ, డి.రాంబాబు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మట్టి కలశం అందజేత



పామర్రు: నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నా మట్టి-నా దేశం కలశ యాత్ర స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పామర్రు ఎంపీడీవో వై.రామకృష్ణ మాట్లాడుతూ గ్రామాల నుంచి సేకరించిన మట్టిని ఒక కలశంలో కలిపి ఆ కలశానికి యాత్ర నిర్వహించామన్నారు. కలశాన్ని పామర్రు మండలానికి కేంద్ర యువజన వ్యవహారాల తరపున ఎంపికైన ఛాంపియన్ భీమాల వినోద్‌కుమార్‌కు అందజేశారు. వీరి ద్వారా ఈనెల 28 నుంచి ఢిల్లీలో ప్రధాని మంత్రి సమక్షంలో జరిగే జాతీయ స్థాయి కార్యక్రమానికి ఈ మట్టిని తీసుకెళతారని తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము, ఏవో టీ సుందర్‌రావు, ఆర్గనైజేషన్ ప్రతినిధులు యువత కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

- ఎమ్మెల్సీ జయమంగళ, ఎమ్మెల్యే డీఎన్నార్
- నియోజకవర్గాల్లో కొనసాగుతున్న వైద్య శిబిరాలు



కైకలూరు వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేద ప్రజలకు వరం లాంటిదని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లా వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ శిబిరంలో ఆయన మాట్లాడారు. పేదలకు ప్రభుత్వ పరంగా ఖరీదైన వైద్యసేవలందించేందుకు ముఖ్యమంత్రి జగనన్న ఎంతగానో తాపత్రయపడుతున్నట్లు పేర్కొన్నారు. అన్ని వర్గాలను అన్ని విధాల ఆదుకుంటున్న ముఖ్యమంత్రి జగనన్నను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ అడవి కృష్ణ మోహన్, జెడ్పీటీసీ కురేళ్ళ బేబి, సర్పంచ్ దానం మేరీనవరత్నకుమారి, తహసీల్దార్ మురళీకృష్ణ, నాయకులు సయ్యపురాజు గుర్రాజు, షేక్ హమీద్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

కైకలూరు(కలిదిండి): ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలి స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆకాంక్షించారు. కలిదిండి మండలం తాడినాడలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, జెడ్పీటీసీ బొర్రా సత్యవతి, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపీపీ కనకదుర్గారాణి, సర్పంచ్ తాడి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు చిన్నబ్బాయరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, ఎంపీటీసీ లక్ష్మణరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండలశాఖ అధ్యక్షుడు తిరుమాని రమేష్, పలువురు అధికారులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: లింగాల హైస్కూల్ ప్రాంగణంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వైస్ ఎంపీపీ ఆదివిష్ణు మాట్లాడుతూ ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం ఒక వరం వంటిదన్నారు. సర్పంచ్ బోయిడి ధనలక్ష్మి, ఎంపీటీసీ కమదన నాయనబాబు, తహసీల్దార్ కే రాజ్‌కుమార్, ఎంపీడీఓ సీకే వెంకటరమణ, వైద్యాధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

641 మందికి వైద్య సేవలు

గుడివాడ టౌన్(నందివాడ): ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందాలనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. నందివాడ మండలం జనార్ధనపురం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. అన్ని విభాగాలకు చెందిన వైద్య బృందం సేవలందిస్తున్న నేపథ్యంలో ప్రజలకు పూర్తి స్థాయిలో వైద్యం అందుతుందని ఆమె అన్నారు. ఈ శిబిరంలో పురుషులు 241, మహిళలు 300, చిన్నారులు 100 మంది మొత్తం 641 మంది వైద్య సేవలు వినియోగించుకున్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వి.భవన్నారాయణ, ఎంపీడీఓ వీఎస్ నాగేశ్వరరావు, ఈఓపీఆర్డీ జి.శ్రీనివాసరావు, ఎంపీపీ పెయ్యల ఆదాం, వైస్ ఎంపీపీ జయరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు దుక్కిపాటి శశిభూషణ్, కందుల నాగరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కొండపల్లి కుమార్ రెడ్డి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ నగుళ్ల సత్యన్నారాయణ, ఎం.వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, సరెళ్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో గీతాబాయి

కాజ(మొవ్వ): మండలంలోని నిడుమోలు పీహెచ్‌సీ పరిధిలో కాజ-1 సచివాలయంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో గీతాబాయి పరిశీలించారు. వైద్యాధికారులు, సిబ్బంది, రోగుల ద్వారా వివరాలు సేకరించారు. సేవలు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ శిబిరంలో 650 మంది వైద్య సేవలు అందుకున్నారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ కొడాల భవాని ప్రారంభించారు. డాక్టర్ సీహెచ్ సోమరాజు, డాక్టర్ ఏ సాయి కిరణ్, డాక్టర్ ఎం.వేదరాజ్, డాక్టర్ విజయశ్రీలు రోగులకు ఈసీజీ, బీపీ షుగర్, ఇరత రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీటీసీ పేకేటి వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ మంద శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జీ సుధాప్రవీణ్ పర్యవేక్షించగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశా వర్కర్లు సహకరించారు.

తోట్లవల్లూరు: ప్రజల ఆరోగ్యానికి జగనన్న ఆరోగ్య సురక్ష వరం లాంటిదని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పెనమకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం మంగళవారం జరిగింది. తోట్లవల్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాయిప్రసన్న పర్యవేక్షణలో నిపుణులైన వైద్యబృందం 553 మందికి ఆరోగ్య పరీక్షలు జరిపి మందులను ఉచితంగా అందించారు. బీపీ, షుగర్, ఈసీజీ, క్షయ పరీక్షలు జరపటంతోపాటు డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలను ఆరోగ్య సిబ్బంది నిర్వహించారు. సర్పంచ్ నందేటి గంగభవాని, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ కళ్లం శివారెడ్డి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, తహసీల్దార్ కుసుమకుమారి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, ఎంపీటీసీ సభ్యుడు మరీదు మధుబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు, సీహెచ్‌ఓ కోటేశ్వరమ్మ, ఎంపీహెచ్ఈఓ మాణిక్యం, పంచాయతీ కార్యదర్శి వెంకటరత్నం, గ్రామ సచివాలయ సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ లక్ష్యం

పామర్రు: అందరికీ ఆరోగ్య సంరక్షణ కల్పించాలనే ఉద్దేశంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం నిర్వహిస్తోందని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్ కుమార్, జెడ్పీటీసీ కె.స్వరూపరాణి అన్నారు. పామర్రు సచివాలయం-1 పరిధిలోని సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. పామర్రు గ్రామ సర్పంచ్ కె.కస్తూరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఏ రమాదేవి, ఎంపీటీసీలు టీ శ్రీనివాసరావు, వెంకటేశ్వరమ్మ, గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు ఎండీ హస్మతుల్లా, మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఆరుమళ్ల శ్రీనాథ్ రెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ధనాల కృపావతి, వార్డు మెంబర్ ఆరేపల్లి శ్రీహరి, తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎంపీడీవో వై.రామకృష్ణ, గ్రామ కార్యదర్శి సలీం, పామర్రు కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.



కాజ-1 సచివాలయ శిబిరంలో వివరాలు సేకరిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి



లింగాలలో మందులు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ ఆదివిష్ణు, తహసీల్దార్



జనార్ధనపురంలో వైద్య పరీక్షలు పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి



పామర్రులో ఆరోగ్యకిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్, జెడ్పీటీసీ స్వరూపరాణి



పెనమకూరులో మందులు అందజేస్తున్న ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్

పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపాలి

-డీపీఓ విశ్వనాథ శ్రీనివాస్



ముదినేపల్లి రూరల్: పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది పన్నుల వసూళ్లపై శ్రద్ధ చూపాలని జిల్లా పంచాయతీ అధికారి టి.విశ్వనాథ శ్రీనివాస్ అన్నారు. ముదినేపల్లిలో మంగళవారం సచివాలయాల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి పలు అంశాలపై మాట్లాడారు. మండలంలో జరుగుతున్న స్వామిత్వా సర్వే పనులు సకాలంలో పూర్తయ్యేందుకు సహకరించాలన్నారు. పన్నులను వసూలు చేసి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ప్రతివ్యక్తి నగదురహిత లావాదేవీలు నిర్వహించేలా ప్రోత్సహించాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్ష సచివాలయల పనితీరు, సిబ్బంది హాజరు తదితర అంశాలపై సమీక్ష చేశారు. స్వామిత్వా సర్వే వివరాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలి



ముదినేపల్లి రూరల్: విద్యార్థుల నడవడిక, విద్యాభ్యాసంపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని వడాలి జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.ప్రభుదాస్ అన్నారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ-2 పరీక్షల్లో విద్యార్థుల ప్రగతిని వివరించేందుకు తల్లిదండ్రులతో పాఠశాలలో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లిదండ్రులు శ్రద్ధ చూపితే విద్యార్థులు ఉత్తమ పౌరులుగా రాణించి, విద్యలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారన్నారు. సీనియర్ ఉపాధ్యాయులు సీహెచ్ నాగమల్లేశ్వరరావు సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులకు విద్యార్థుల ప్రగతి గురించి వివరించి కార్డులు అందజేశారు.

చిన్నారులకు ఫిజియోథెరపీ

పెదపారుపూడి: స్థానిక ప్రాథమిక పాఠశాల-1లో దివ్యాంగులకు మంగళవారం ఫిజియోథెరపీ క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపిస్టు కామరాజు ఆరుగురు చిన్నారులకు థెరపీ చేశారు. ప్రతి వారం క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేయిస్తే మంచిఫలితాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐఆర్పీలు హరిబాబు, కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

సీనియర్ సివిల్ జడ్జి కేవీ కృష్ణయ్య



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కేవీ కృష్ణయ్య

ఎలకుర్రు(పామర్రు): మానసిక ఆరోగ్య చట్టాన్ని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తెలుసుకోవాలని కృష్ణా జిల్లా సీనియర్ సివిల్ జడ్జి కేవీ కృష్ణయ్య అన్నారు. మండల పరిధిలోని ఎలకుర్రు గ్రామంలోని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య (కేడీబీ) ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దివ్యాంగుల పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం మంగళవారం నిర్వహించారు. మానసిన వ్యాధి గ్రస్తులైన దివ్యాంగులకు, వారి తల్లిదండ్రులకు న్యాయ పరమైన అంశాలు, వారికి ఉన్న అవకాశాల గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వ్యాధి గ్రస్తులైన దివ్యాంగులకు ప్రభుత్వాలు ఎన్నో చట్టాలను తీసుకువచ్చి వారి అభివృద్ధికి కృషి చేస్తున్నాయని అన్నారు. మానసిక దివ్యాంగులకు ఏమైనా న్యాయ పరమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకు వస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని అన్నారు. సామాన్య పౌరులకు ఎటువంటి హక్కులు సమాజంలో ఉన్నాయో వాటికి సమానమైన హక్కులు దివ్యాంగులకు కూడా వర్తిస్తాయని అన్నారు. దివ్యాంగుల అభ్యున్నతికి అనేక వినూత్న పథకాలను, హక్కులను , సదుపాయాలను కల్పిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా మచిలీపట్నం రోటరీ క్లబ్‌కు మూడు కుట్టు మిషన్లను ఉచితంగా అందజేశారు. ఉయ్యూరు ఆర్డీవో విజయకుమార్, పామర్రు తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, న్యాయవాదులు అజ్మతున్నీసా, సీహెచ్ ముసలయ్య, ట్రస్టు నిర్వాహకులు కాశీనాథుని నాగేశ్వరరావు, మచిలీపట్నం రోటరీ క్లబ్ అధ్యక్షులు లింగం మోజేష్, కార్యదర్శి అనుపన ముఖర్జీ, దివ్యాంగుల పాఠశాల ప్రిన్సిపాల్ వసుంధర, ట్రస్టు పాఠశాల అధ్యాపకులు, దివ్యాంగులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల కరపత్రం ఆవిష్కరణ

మచిలీపట్నంటౌన్: స్థానిక గాంధీబొమ్మ శివాలయంలో నిర్వహించనున్న శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి 23వ తేదీ వరకు ఆలయంలో ఉత్సవాలు జరుగుతాయని ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ తమ్మన రాధాకృష్ణమూర్తి, కార్యదర్శి యెండూరి సురేష్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఇందుకోసం విస్తృత ఏర్పాటులు చేస్తున్నట్టు తెలిపారు. బుట్టాయిపేటలోని గణపతి సచ్చిదానంద దత్తాశ్రమంలో ఈ నెల 15 నుంచి ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. రోజూ అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిస్తారని వివరించారు.


ఖోఖో క్రీడాకారిణికి ఎమ్మెల్యే అభినందన



క్రీడాకారిణి దీప్తిని అభినందిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: స్థానిక ఎస్పీఎస్ మున్సిపల్ పాఠశాల విద్యార్థిని జి.దీప్తి జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఉత్తమ ప్రదర్శన చేసినందుకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆ విద్యార్థిని అభినందించారు. పట్టణంలోని రాజేంద్ర నగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో విద్యార్థిని, కోచ్ మడకా ప్రసాద్‌లు ఎమ్మెల్యే కొడాలి నానిని మంగళవారం కలిశారు. ఈనెల 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు తమిళనాడులో ఓసూర్‌లో జరిగిన జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఎస్పీఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి దీప్తి ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొని తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని సాధించిందని కోచ్ ఎమ్మెల్యే నానికి వివరించారు. ఖేల్ ఇండియా స్థాయిలో గుడివాడ కీర్తిని ఇనుమడింప చేసినందుకు దీప్తిని ఎమ్మెల్యే నాని అభినందించారు. విద్యార్థినికి కావాల్సిన సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎస్.మురళీ, డీవైఈవో పద్మ, ఎంఈవో-2 బాలాజీ, పాఠశాల హెచ్‌ఎం టీఎంఈరాణి తదితరులు దీప్తిని అభినందించారు.

ఖోఖో పోటీలకు ఎంపిక



అండర్-19 ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

మండవల్లి: రాష్ట్రస్థాయి అండర్-19 ఖోఖో పోటీలకు మండవల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు ఎంపికైనట్లు లోకుమూడి హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు బి. వేణుబాబు మంగళవారం పేర్కొన్నారు. పీబీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన అండర్-19 ఖోఖో పోటీల్లో అబ్దుల్ హరున్నీసా, బి.నాగేశ్వరి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు చిత్తూరులో ఈనెలలో జరగబోయే రాష్ట్ర స్థాయి అండర్-19 ఖోఖో పోటీల్లో పాల్గొంటారని జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం పి.వెంకటేశ్వరరావు వివరించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు వేణుబాబును, క్రీడాకారులను పలువురు అభినందించారు.

నేడు ఎమ్మెల్యే కైలే పర్యటన

తోట్లవల్లూరు: పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ మండలంలోని రొయ్యూరు గ్రామంలో బుధవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీయూపీ పాఠశాల ఆవరణలో ఉదయం 10 గంటలకు జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొంటారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొనాలని వెంకటేశ్వరరెడ్డి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టులకు రెండో విడత అక్రిడిటేషన్లు మంజూరు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హత కలిగిన జర్నలిస్టులకు రెండో విడత అక్రిడిటేషన్లు మంజూరు చేశామని కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. ఆయన చాంబర్‌లో మంగళవారం అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు మంజూరు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు, కార్మిక శాఖాధికారి ఎస్. గోవింద్, రైల్వే అధికారి సయ్యద్ అమీర్, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌బీ సతీష్‌కుమార్, కమిటీ సభ్యులు పైడేశ్వరరావు, కె. గణేష్‌కుమార్, రాజేంద్రప్రసాద్, శ్రీకాంత్, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖాధికారి ఎం. వెంకటేశ్వరప్రసాద్, డివిజనల్ పీఆర్వో జి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యం

కలెక్టర్ రాజాబాబు



రైతులకు పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు. చిత్రంలో ఎమ్మెల్యే కొడాలి నాని, జేసీ అపరాజితసింగ్

చిలకలపూడి(మచిలీపట్నం): పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్ల కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మంగళవారం ఆయన చాంబర్‌లో గుడివాడకు చెందిన భూ సమస్య పరిష్కరించినందుకు గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నానితో కలిసి రైతులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గుడివాడ బైపాస్‌రోడ్డు ఎదురుగా ఉన్న షాదీఖానా సమీపంలోని 2.03 ఎకరాల భూమి 2017లో సర్వే పేరుతో జమిందారీ భూమిగా మార్చారని కొడాలి నానికి తమ ఇబ్బందిని తెలియజేసిన వెంటనే ఆయన కలెక్టర్ రాజాబాబు ద్వారా భూమి సమస్యను పరిష్కరించి తమకు పట్టాలు ఇచ్చారని ఎస్‌కే షమ్ము, మొహమ్మద్ ఇలియాస్, షేక్ ఇమామ్, మురారి నరసింహారావు తదితరులు కలెక్టర్ వద్ద ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బాపులపాడులో 400 ఎకరాల భూమిని వెయ్యి మందికి పట్టాలుగా ఇచ్చామని, మచిలీపట్నం సర్కారుతోటలోని భూమిని పట్టాలుగా ఇచ్చామని వివరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్ పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఈ వెంకటేశ్వర్లు

మొవ్వ: విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ డీఈఈ కే వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దొంగతనంగా విద్యుత్ వినియోగిస్తున్న ఒకరికి రూ.30 వేలు, అనుమతికి మించి లోడు వాడుతున్న 158 సర్వీసులకు రూ.4,45,000 అపరాధ రుసుము విధించినట్లు డీఈఈ వెల్లడించారు. ఈ దాడుల్లో అధికారులు 38 బృందాలుగా విడిపోయి 2122 గృహ విద్యుత్ సర్వీసులను, 144 వాణిజ్య సర్వీసులను, 5 ఇతర సర్వీసులను తనిఖీ చేసినట్లు పామర్రు డెప్యూటీ ఇంజినీర్ కే సుందరరావు తెలిపారు. మచిలీపట్నం ఈఈ ఎం.భాస్కరరావు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.